నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 22 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



పోలీసులు, అధికారులతో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

# రెండు గంటల ఆలస్యానికి కారకులెవరు?

**డే-2 పేపర్ వచ్చినట్లు 9.24 గంటలకే ఉన్నతాధికారులకు సమాచారం**

- విషయం చెప్పినా తీరిగ్గా 9.40కి వచ్చిన అధికారి
- ఆ తర్వాత డీఈవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన వైనం
- సకాలంలో స్పందించి ఉంటే సమయానికి పరీక్ష జరిగేదేమో..!

మంచిర్యాల, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ప్రశ్న పత్రం తారుమారైంది. ఒకదానికి బదులు.. మరొకటి ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. పేపర్ లీకేజీ అని.. హిందీ పేపర్ విద్యార్థులకు ఇచ్చి తిరిగి తీసుకున్నారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. ఈ విషయమై కలెక్టర్ కుమార్ దీపక్ స్పందించి ఎక్కడ పొరపాటు జరిగిందనే విషయమై ఆరా తీశారు. పేపర్ బండిల్ ఓపెన్ చేయకముందే అది డే-2 పేపర్‌గా గుర్తించామని, పార్సిల్ చేసే సమయంలో పొరపాటు జరిగిందని ఆయన చెప్పారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఎలాగైతే పేపర్ వచ్చిందో సీల్ ఓపెన్ చేయకుండా అలాగే ఉందని... దాన్ని తిరిగి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి తెలుగు పేపర్ తీసుకువచ్చి పరీక్ష నిర్వహించామని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యహరించారంటూ ఇద్దరు అధికారులను సైతం సస్పెండ్ చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. పరీక్ష రెండు గంటలు ఆలస్యంగా జరగడానికి కారణం ఏమిటి.. అసలు కేంద్రం లోపల ఏం జరిగింది ? అనే విషయంపై చర్చ సాగుతున్నది.

### సరిగా చెక్ చేసుకోలేదు..

మంచిర్యాలలో 9 సెంటర్లకు సంబంధించిన పదో తరగతి ప్రశ్నపత్రాలు ఈ నెల 10వ తేదీనే వచ్చాయి. అదే రోజున తొమ్మిది సెంటర్లకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంటల్ అధికారులు(డీవో)లు, ఇతర అధికారుల ఆధ్వర్యంలో డే-1, డే-2, డే-3 పేపర్లు అన్నింటినీ వేటికవే వేరు చేసి సీల్ చేశారు. అనంతరం డే-1 పేపర్లను ట్రంక్ బాక్సులో పెట్టి లాక్ చేశారు. ఇక పరీక్ష నిర్వహించే రోజున ఆ లాక్‌లను ఓపెన్ చేసి.. ఎస్సెస్సీ ఎగ్జామినేషన్ మ్యానువల్‌ను అనుసరించి డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీవో) ప్రశ్నపత్రాల సీల్ చూసుకుంటారు. కౌంట్ చేసుకుంటారు. ఈ రోజు పేపర్ ఏంటి ? సబ్జెక్ట్ ఏంటి ? పేపర్ కోడ్ ఏంటి ? ఇలా అన్ని సరిచూసుకున్నాక పోలీస్ స్టేషన్ నుంచి ఆ పేపర్లు పరీక్ష కేంద్రాలకు తీసుకొని వస్తారు. ఇదీ? ప్రక్రియ.. కానీ, బాయ్స్ హైస్కూల్ డీవో పూర్తిస్థాయిలో చెక్ చేసుకోలేదని తెలుస్తున్నది. డీవోతో పాటు పేపర్లు చూడాల్సిన మరో అధికారి చీఫ్ సూపరింటెండెంట్ (సీఎస్) బాయ్స్ హైస్కూల్‌లో సీఎస్‌గా ఉండడంతో పాటు ఆయనే మంచిర్యాల మొత్తానికి కస్టోడియన్ అధికారిగా ఉన్నారు. అంటే ప్రశ్నపత్రాలు 9 సెంటర్ల అధికారులకు అప్పగించాక.. డే-2 పేపర్లను ట్రంక్ బాక్సుల్లో పెట్టి లాక్ చేసుకొని ఆ లాక్‌ను స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఇచ్చి అక్కడి నుంచి రావాల్సి ఉంటుంది. సీఎస్‌కు ఆలస్యం అవ్వడంతో డీవో స్క్వాడ్‌ను వెంట పెట్టుకొని ప్రశ్నాపత్రాలు తీసుకొని పరీక్ష కేంద్రానికి వెళ్లారు. అనంతరం సీఎస్ పరీక్ష కేంద్రానికి వెళ్లి డీవో తెచ్చిన పశ్నాపత్రాలను సీల్ ఓపెన్ చేసేందుకు సిద్ధమయ్యారు.

### ఉదయం 9.24 గంటలకే గుర్తింపు..

ప్రశ్నపత్రాల బండిల్స్ ఓపెన్ చేయడానికి ముందు ప్లాస్టిక్ కోటెడ్ సీల్ కవర్ ఉంటుంది. దానిలోపల పేపర్ కవర్ సీల్ ఉంటుంది. దాని మీద వైట్ పేపర్ రిబ్బన్స్ కట్టి ఉంటుంది. అంటే మూడు దశల్లో సీల్స్ ఓపన్ చేశాక.. ప్రశ్నపత్రాల బండిల్స్ సీల్స్ ఉంటాయి. ఇలా బాయ్స్ హైస్కూల్‌కు వచ్చిన పేపర్ బండిళ్లలో మొదటి ప్లాస్టిక్ కోటెడ్ సీల్ కవర్‌ను సీఎస్ కట్ చేశారు. అది కట్ చేయగానే తెలుగుకు బదులు డే-2 పేపర్ (హిందీ) వచ్చిందని ఆయన గుర్తించారు. వెంటనే డిపార్ట్‌మెంటల్ అధికారి(డీవో)కు సమాచారం ఇచ్చారు. దానికి డీవో హడావుడిలో పేపర్ సరిగా చూసుకోలేదంటూ చెప్పారు. అప్రమత్తంగా వ్యవహరించిన సీఎస్ వెంటనే బయటికి వచ్చిన పోలీస్ కానిస్టేబుల్ సెల్‌ఫోన్ తీసుకొని ఏసీజీ (అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్)కి డే-1కు బదులు డే-2 పేపర్లు వచ్చాయని విషయాన్ని చెప్పారు. అప్పటికీ సమయం ఉదయం 9.24 అయ్యింది. దానికి ఆయన ఎవరితో చెప్పకండీ నేను వస్తున్నానని చెప్పి 9.40 గంటలకు సెంటర్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకొని సీల్ ఓపెన్ చేశారా? అని అడిగారు. లేదు ఓపెన్ చేయలేదని చెప్పగా అదే ప్లాస్టిక్ కోటెడ్ సీల్ కవర్ చుట్టి పక్కన పెట్టండి అని చెప్పి.. నేను ఇప్పుడే వస్తానని బయటికి వెళ్లారు. మిగిలిన 8 సెంటర్లు తిరిగి ఏ ప్రశ్నపత్రం వచ్చిందో తెలుసుకొని ఉదయం11 గంటలకు తిరిగి బాయ్స్ హైస్కూల్ సెంటర్‌కు వచ్చారు. వచ్చీ రాగానే ఎగ్జామ్ ఎందుకు పెట్టలేదంటూ ఆరా తీశారు. పేపర్ మారిపోయిన విషయం చెప్పాం కదా సార్ అంటే.. డే-2 పేపర్‌తో పాటు డే-1 పేవర్ కూడా వచ్చిందనుకున్నా.. ఎగ్జామ్ నడుస్తుంది అనుకున్నా.. అంటూ ఆయన సెలవు ఇచ్చారు. అధికారుల కమ్యూనికేషన్ గ్యాప్‌తో అసలు ఆలస్యం జరిగింది. సదరు అధికారి పరీక్ష కేంద్రానికి వచ్చే ముందే ఫోన్‌లో డీఈవో, కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. వాళ్లు వచ్చాక ప్రశ్నపత్రాలను మార్చి తీసుకువచ్చిన పరీక్ష పెట్టే సరికి 11.30 అయ్యింది. అదే సదరు అధికారి వెంటనే స్పందించి ఉంటే 9.40 గంటలకే పరీక్ష పేపర్ తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చి, తెలుగు పేపర్ తెస్తే అయిపోయేది. పదిహేను, ఇరవై నిమిషాల్లోనే ఎగ్జామ్ మొదలయ్యేది. కానీ ఏసీజీ ఈ విషయాన్ని వదిలిపెట్టి మిగిలిన 8 సెంటర్లలో ఏ పేపర్ వచ్చిందో పరిశీలించి రావడంతో ఇక్కడ ఆలస్యమైపోయింది.

### కలెక్టర్ సీరియస్..

విషయం తెలుసుకొని సెంటర్‌కు వచ్చిన కలెక్టర్ బాధ్యులైన అధికారులపై సీరియస్ అయ్యారు. డే-2 పేపర్ వచ్చిన విషయం ఏ సమయానికి గుర్తించారంటూ సీఎస్‌ను అడిగారు. దానికి 9.24 గంటలకు విషయం ఏసీజీకి ఫోన్ చేసి చెప్పినట్లు తెలియడంతో ఏసీజీ నిర్లక్ష్యంపై మండిపడినట్లు తెలిసింది. 9.40 గంటలకు సెంటర్‌కు వచ్చిన ఏసీజీ ఇక్కడ సమస్య పరిష్కరించకుండా మిగిలిన సెంటర్లకు ఎందుకు వెళ్లినట్లు అన్నది ఇక్కడ అర్థం కాకుండా మారింది. ఈ మొత్తం వ్యవహారంలో అసలు బాధ్యులైన అధికారిని వదిలేసి కేవలం సెంటర్ సీఎస్, డీవోలపై చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



లక్షెట్టిపేట : నేలరాలిన వడ్లు



కౌటాల : తలోడి గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం



రెబ్బెన : వాహనంపై పడిన చెట్టు



దండేపల్లి : గూడెంలో కురిసిన వడగండ్లు

- పలుచోట్ల ఉరుములు.. మెరుపులతో వడగండ్లు
- నేలకొరిగిన వరి, మక్క ● రాలిపోయిన మామిడి కాయలు
- కూలిన చెట్లు, స్తంభాలు ● విద్యుత్ సరఫరాలో అంతరాయం
- నౌగాం బస్తీలో గోడ కూలి వృద్ధురాలి మృతి

# అకాల నష్టం

**మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో గాలివాన బీభత్సం**

నమస్తే నెట్‌వర్క్ : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఉరుములు.. మెరుపులతో అక్కడక్కడా వడగండ్లు పడగా, ఈదురు గాలులకు పంటలు నేలకొరిగి రైతన్నలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల చెట్లు, స్తంభాలు పడిపోయి.. వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. దండేపల్లి మండలం గూడెం, ముత్యంపేట, తదితర గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. ఈదురుగాలులకు తాళ్లపేటలోని ప్రధాన రహదారి సమీపంలో వరి, మక్క నేలకొరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల పిందె దశలో ఉన్న మామిడి కాయలు రాలిపోయాయి. హాజీపూర్ మండలంలోనూ వడగండ్లు పడ్డాయి. తాండూర్, కాసిపేట మండలాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం పడగా, కొన్ని చోట్ల తేలికపాటి వాన పడింది. మందమర్రిలో ఉరుములు.. మెరుపులతో వాన పడింది. లక్షెట్టిపేట మండలంలో వడగండ్లు పడ్డాయి. తిమ్మాపూర్, లక్ష్మీపూర్, కొత్తూరు, గంపలపెల్లి, మోదెలలో వరి నేలవాలింది. ఇటిక్యాలలో బండారి రవి, మల్లేశ్, శ్రీనివాస్ తదితర రైతులకు చెందిన సుమారు 20 ఎకరాల్లో వరి నేలమట్టమైంది. మరో 15 రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటున్న దశలో అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేమనపల్లి మండలం నీల్వాయి, మామడలో మామిడి కాయలు రాలి కింద పడ్డాయి. మట్టి రోడ్లు బురదమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై చెట్టు, తలోడి గ్రామంలో 11 కేవీ విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడ్డాయి. పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కాగజ్‌నగర్ పట్టణంలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఇళ్ల పై కప్పులు, తాత్కాలికంగా నిర్మించిన షెడ్ల రేకులు ఎగిరిపోయాయి. ప్రధాన రోడ్డుపై ఫారెస్ట్ క్వార్టర్స్ వద్ద రోడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మున్సిపల్ అధికారులు, పోలీసులు స్పందించి వాటిని తొలగించారు. త్రినేత్ర శివాలయం సమీపంతో పాటు పలు కాలనీల్లో కొమ్మలు వీరిగి కరెంట్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. నౌగాం బస్తీలో ఇంటి గోడ కూలీ దావులత్(65) మృతి చెందింది. కాగా, ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండగా, ఈ వానతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రెబ్బెన మండలంలోని పలు గ్రామాల్లో గాలివానకు చెట్లు విరిగి వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెబ్బెనలో చెట్టు విరిగి పడగా, ఒకరి ద్విచక్ర వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది. గోలేటిలో శ్రీపతి కిరాణం పై కప్పు రేకులు లేచి పోయాయి. షాప్‌లోని వస్తువులు తడిసిపోయాయి.



రెబ్బెన : గోలేటిలో గాలికి ధ్వంసమైన కిరాణం



కాగజ్‌నగర్ : కూలిన బోర్డు, తాత్కాలిక షెడ్డు



కాగజ్‌నగర్ : ప్రధాన రోడ్డుపై చెట్ల కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు, మున్సిపల్ అధికారులు



తాండూర్ : కురుస్తున్న వర్షం

# బాబోయ్ ఎల్ఆర్ఎస్ !

**ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 నిబంధనలతో సతమతం**

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దరఖాస్తుదారులు
- గడువులోగా పూర్తిచేయడం కష్టమే !





మంచిర్యాలలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారుల కోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్

మంచిర్యాలటౌన్, మార్చి 21 : లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం 2020 కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే కఠిన తరమైన నిబంధనల మూలంగా ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. 2020 సంవత్సరంలో రూ. 1000 చెల్లించి ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరితో ఫీజు చెల్లించుకుని వారికి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్‌లు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. కానీ ప్లాట్లు కొనుగోలు చేసిన వారు దరఖాస్తు చేసుకున్న తర్వాత ప్రాథమిక దశలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు విచారణ జరిపి ఆ ప్లాటు సరైనదేనా? కాదా ? అన్న విషయానికి నిర్ధారణకు వస్తారు. సంబంధిత భూమి పత్రాలు కరెక్టుగా ఉన్నాయా ? ప్రభుత్వ భూమిలో ఉన్నదా ?, చెరువులు, వాగుల బఫర్‌జోన్‌లలో ఉన్నదా?, రోడ్డు సదుపాయం కావాల్సినంత ఉందా, ఆ భూమిపై కోర్టు కేసులేమైనా ఉన్నాయా?, నిషేధిత ప్రదేశంలోకి వస్తుందా? అన్న అంశాలను పరిగణలోకి తీసుకుని, వాటిలో ఏదైనా అనుమానం ఉంటే అక్కడే దానిని రిజెక్టు చేస్తారు. దరఖాస్తు చేసుకున్న చాలా వాటిలో షార్ట్‌ఫాల్, ప్రొహిబిటెడ్ అంటూ తిరస్కరిస్తున్నారు. దీని నుంచి ఎలా ఎల్ఆర్ఎస్ పొందాలన్న అంశంలో దరఖాస్తు దారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఎల్1, ఎల్2, ఎల్3 స్టేజ్‌లలో దరఖాస్తును ముందుకు తీసుకువెళ్లడం వారికి గగనంగా మారుతున్నది. 25శాతం రాయితీని పొందాలన్న ఆశతో వచ్చిన వారిలో ఈ షార్ట్‌ఫాల్, ప్రొహిబిటెడ్ అప్షన్‌లను చూసి కంగు తింటున్నారు. ఇందుకు ఈ ఎల్1, ఎల్2, ఎల్3 నిబంధనలే కారణంగా చెబుతున్నారు. రిమార్క్స్‌లో పేర్కొన్న అ అంశాలను పరిష్కరించుకోవాలంటే ముందుగా మీసేవా కేంద్రానికి వెళ్లి ఎల్1కు దరఖాస్తు చేసుకోవాలి, ఆ తరువాత ఎల్2 స్థాయిలో తహసీల్ కార్యాలయానికి, ఇరిగేషన్ ఇంజినీర్ దగ్గరకు వెళ్లి వారి నుంచి ఎన్వోసీ తెచ్చుకోవాలి. చివరి దశలో మున్సిపల్ కమిషనర్ ఎల్ఆర్ఎస్ ఫీజును చెల్లించేందుకు అనుమతిస్తూ ఆన్‌లైన్‌లో ఓకే చేయాల్సి ఉంటుంది. ఈ తతంగమంతా జరగాలంటే పెద్ద ఎత్తున రిస్క్ తీసుకోవాల్సి వస్తుందని, కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నామని పలువురు అంటున్నారు.

### వేల సంఖ్యలో దరఖాస్తులు..

ఎల్ఆర్ఎస్ కోసం 2020 సంవత్సరంలో మంచిర్యాలతో పాటు నస్పూర్ మున్సిపాలిటీ, ప్రస్తుతం కార్పొరేషన్‌లో విలీనమైన ఐదు గ్రామపంచాయతీల పరిధిలో వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. వీటన్నింటినీ నిర్ణీత గడువు ఈ నెల 31లోగా పరిష్కరించి ఫీజులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీలకు ప్రభుత్వం సూచించింది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 23,303 దరఖాస్తులు రాగా అందులో ఇప్పటివరకు 236 మంది ఫీజు చెల్లించారు. నస్పూర్ మున్సిపాలిటీలో 4922 దరఖాస్తులు రాగా 68, ఐదు గ్రామపంచాయతీల పరిధిలో 4874 దరఖాస్తులు రాగా అందులో 20 దరఖాస్తు దారుల నుంచి మాత్రమే ఫీజులు వసూలుచేశారు.

## నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న డీఎల్పీవో ఉమర్ హుస్సేన్

వాంకిడి, మార్చి 21 : వాంకిడి మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని డీఎల్పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమీక్షాసమావేశానికి ఆయన హాజరయ్యారు. పంచాయతీల్లో శానిటేషన్ ప్రక్రియ నిరంతరం జరిగేలా చూడాలని, నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్‌పై విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

## సమస్యలపై సత్వరమే స్పందించాలి

జన్నారం, మార్చి 21 : మండలంలోని జన్నారం, దేవునిగూడ గ్రామ పంచాయతీలను శుక్రవారం మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు సందర్శించారు. ఆయా పంచాయతీల్లో చేడపడుతున్న పారిశుధ్య పనులు, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, వివిధ కాలనీల్లో ప్రజలకు ఇబ్బందులు కలిగినా సహించేదిలేదని అధికారులను హెచ్చరించారు. అప్రమత్తంగా ఉంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు.



దేవునిగూడ జీపీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో

## ఎస్టీపీపీలో మూడో ప్లాంట్ ప్రారంభానికి ఏర్పాట్లు

జైపూర్, మార్చి 21: ఎస్టీపీపీలో మరో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం (మూడో ప్లాంట్) పనులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.9,500 కోట్లతో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు అన్ని అనుమతులు రాగా, నిర్మాణ సంస్థ బీహెచ్ఈఎల్‌తో ఇప్పటికే ఒప్పందపత్రాలు మార్చుకున్నది. రాష్ట్ర ప్రముఖులతో దీనిని ప్రారంభించే అవకాశమున్నందున శుక్రవారం కలెక్టర్ కుమార్‌దీపక్ అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి సందర్శించారు. శిలాఫలకం,హెలీప్యాడ్, బహిరంగ సభ కోసం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గెస్ట్‌హౌస్‌లో సమీక్ష నిర్వహించారు. శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, చీఫ్‌ఆఫ్‌వోఅండ్ఎం జైన్‌సింగ్, ఏసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఎస్టీపీపీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## టీబీ రహిత సమాజం కోసం కృషి

**మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్**

మంచిర్యాల అర్బన్, మార్చి 21 : టీబీ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అ ధికారి డా.హరీశ్ రాజ్ అన్నారు. శుక్రవారం జాతీయ అక్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24న నిర్వహించే ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాల కోసం స్థానిక జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ టీబీకి సంబంధించిన లక్షణాల గురించి వివరించి అనుమానితులు ఆరోగ్య, వైద్య సిబ్బంది సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందు లు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 2023లో 16438 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 1413 మందికి, 2024లో 21212 మందికి పరీక్షలు నిర్వహించగా, 1278 మందికి టీబీ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ప్రస్తుతం 871 కేసులు యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప వైద్యాధికారి డా.అనిత, పీవోలు సుధాకర్ నాయక్, కృపాబాయి, డీపీవో ప్రశాంతి, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





గోడప్రతులను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో